ఉద్యానవనం.. నిర్వహణలో నిర్లక్ష్యం

- పేరుకే పార్కు.. అక్కడ కనిపించేది ఖాళీ స్థలం
- పార్కు అభివృద్ధిని విస్మరించిన మున్సిపాలిటీ
- కనీసం వాకింగ్ ట్రాకింగ్ నిర్మించాలంటున్న ప్రజలు
- నిరుపయోగంగా 88 సెంట్ల విశాల మునిసిపల్ స్థలం


అమలాపురం 28వ వార్డులో పార్కు స్థలానికి ఏర్పాటు చేసిన ప్రహరీ, గేటు


రెడ్డి నాయుడు తోటలో పార్కు కోసం కేటాయించిన 88 సెంట్ల స్థలం

అమలాపురం టౌన్: ప్రజలకు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించడంతోపాటు, పచ్చదనంతో నిండి పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఉద్యానవనాల అభివృద్ధిపై అమలాపురం మున్సిపల్ పాలకులు, అధికారాలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణ వాసులు సాయంత్ర వేళ కొంత సమయం సేదతీరేందుకు, పిల్లలు ఆడుకునేందుకు, నడక వ్యాయామం చేసేందుకు పట్టణ పరిధిలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన ఒక్క పార్కు కనిపించడం లేదు.

28వ వార్డు పరిధిలోని నల్లా రెడ్డినాయుడు తోటలో..

పట్టణంలోని 28వ వార్డు పరిధిలోని నల్లా రెడ్డినాయుడు తోటలో మున్సిపాలిటీకి చెందిన 88 సెంట్ల సువిశాల స్థలం ఎలాంటి ప్రయోజనం లేకుండా నిరుపయోగంగా ఉంది. ఆ స్థలాన్ని ఉద్యానవనం (పార్కు)గా అభివృద్ధి చేయడానికి గతంలో నిర్ణయించి నిరుపయోగంగా వదిలేశారు. ఇప్పుడు అక్కడ కనిపించేది మాత్రం ఎటువంటి పచ్చదనం లేని బీడుభూమిని తలపించే ఖాళీ స్థలం. రోజూ ఉదయాన్నే కొందరు స్థానికులు వచ్చి ఇక్కడ వాకింగ్ చేస్తున్నారు. దాదాపు 25 ఏళ్ల కిందట నల్లా రెడ్డినాయుడు తోట పేరుతో ఏర్పడిన లే అవుట్ అది. అప్పట్లో కామన్ సైట్‌గా 88 సెంట్ల స్థలాన్ని వదిలారు. కాలక్రమంలో 17 ఏళ్ల క్రితం ఆ కామన్ సైట్‌ను డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు పార్కుగా నామకరణం చేశారు. అనంతరం అభివృద్ధి పనులకు అడుగు కూడా ముందుకు పడలేదు.

రూ.30 లక్షల మునిసిపల్ నిధులతో రక్షణ గోడ

పార్కు స్థలం ఎటువంటి రక్షణ లేకుండా ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉన్నందున గత కౌన్సిల్‌లో కౌన్సిలర్‌గా పనిచేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు రూ.30 లక్షల మునిసిపల్ నిధులతో ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఇనుప గేటు, స్థలానికి వెలుపుల నివాసం ఉండేవారికి సౌకర్యవంతంగా ఉండేందుకు సీసీ రోడ్డు నిర్మించారు.

వాకింగ్ ట్రాక్ శిథిలం

ఇప్పుడు ఆ పార్కు స్థలాన్ని 28,29 వార్డుల ప్రజలు వాకింగ్ కోసం వినియోగించుకుంటున్నారు. గత కౌన్సిల్‌లో గ్రావెల్‌తో వాకింగ్ ట్రాక్ నిర్మించినప్పటికీ అది ప్రస్తుతం దాదాపు శిథిలమైంది. ఈ అసౌకర్యాల నడుమే రోజూ ఉదయం వాకర్స్ ఆ స్థలంలో వాకింగ్ చేస్తున్నారు.దీనిపై మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ త్వరలోనే పార్కును అభివృద్ధి చేస్తామని చెబుతున్నారే తప్ప ప్రగతి ప్రణాళికను వివరించడం లేదు.

రూ.కోట్లు విలువ చేసే స్థలం అది

ప్రస్తుత మార్కెట్ ప్రకారం పార్కు కోసం కేటాయించిన 88 సెంట్ల స్థలం దాదాపు రూ.8 నుంచి రూ.10 కోట్ల విలువ ఉంటుంది. పట్టణంలో ఇప్పటికే ఉన్న ఆరు పార్కుల్లో ఒక్క పార్కును మాత్రమే మున్సిపాలిటీ మనుసు పెట్టి అభివృద్ధి చేస్తోంది. మిగిలిన పార్కుల ఆలనాపాలనను అంతగా పట్టించుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో 28వ వార్డులోని కామన్ సైట్‌ను పార్కుగా అభివృద్ధి చేస్తామంటూ కాలయాపన చేయడం కంటే అక్కడ పక్కా వాకింగ్ ట్రాక్ నిర్మించి వాకర్స్ సేద తీరేందుకు కొన్ని సిమెంట్ బల్లలు ఏర్పాటు చేస్తే సరిపోతుందని ఆ ప్రాంత వాకర్స్ మున్సిపాలిటీని కోరుతున్నారు.

వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కృషి



నేను కౌన్సిలర్ అయినప్పటి నుంచి రెడ్డినాయుడు తోటలోని పార్కు స్థలాన్ని పార్కుగా కంటే పక్కా వాకింగ్ ట్రాక్ నిర్మించి ప్రజలకు పూర్తి అందుబాటులోకి తేవాలని ప్రయత్నం చేస్తున్నాను. వాకింగ్ ట్రాక్‌తో పాటు వాకర్స్ కొద్ది సేపు విశ్రాంతి తీసుకునేందుకు ఏదైనా నీడ కల్పించాలి. ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటుచేస్తే వ్యాయామం చేసే వారికి సౌకర్యంగా ఉంటుంది. మొత్తంగా ఈ కామన్ సైట్‌ను వ్యాయామానికి పూర్తిగా అనుకూలంగా ఉండేలా చేసే దిశగా కృషి చేస్తున్నాను.

– గోపి రాజీ, కౌన్సిలర్, 28వ వార్డు, అమలాపురం మున్సిపాలిటీ

క్లుప్తంగా

సీపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాట్రేనికోన: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) విజయవాడ కేంద్రంగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 3 ఏళ్ల డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ తెలిపారు. మూడేళ్ల డిప్లొమా కోర్సులు, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ డిగ్రీ అర్హతతో రెండేళ్ల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. మే 29లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సీపెట్ నిర్వహించే క్యాట్ పరీక్ష(సీఏటీ) జూన్ 8న నిర్వహించి, మెరిట్ ప్రాతిప్రదికన 150 సీట్లు భర్తీ చేస్తామన్నారు.

పోలేకుర్రు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



పోలేకుర్రులో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ చైతన్యకృష్ణ తదితరులు

తాళ్లరేవు: పోలేకుర్రు చెక్‌పోస్టు వద్ద కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ ఎస్పీ బిందుమాదవి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. యానాం–తాళ్లరేవు సరిహద్దులో ఉన్న ఈచెక్ పోస్టును పటిష్టం చేస్తున్నామన్నారు. దేశ భద్రతలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కోరంగి, గొల్లపాలెం ఎస్సైలు పి.సత్యనారాయణ, మోహన్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూల సేవ

అమలాపురం రూరల్: పాత బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాసం పంచరాత్రి దివ్య కల్యాణం సందర్భంగా ఆదివారం త్రిశూల సేవను శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అమ్మ, స్వామి వార్లను ఊరేగింపు నిర్వహించారు. ఆలయ పురోహితులు సద్గురువు సత్యనారాయణ పౌరోహిత్యంలో శంకర మూర్తి, చంద్రకళ దంపతులు కర్తలుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం త్రిశూలాన్ని శంకరమూర్తి శిరస్సు ఉంచి స్నానం చేయించారు. రాత్రి 7 గంటలకు శివాలయం వద్ద నాగవల్లి సేవ నిర్వహించారు.

డాక్టర్ సర్వేశ్వరశర్మకు సైన్స్ పాపులైజేషన్ అవార్డు


తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ హైదరాబాద్‌లో సైన్స్ పాపులైజేషన్ అవార్డును ఆదివారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టర్ సర్వేశ్వరశర్మ ఈ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఐఐసీటీలోని వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన సైన్స్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందుకున్నట్లు సర్వేశ్వరశర్మ తెలిపారు. అకాడమి సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ సంస్థ ఈ అవార్డుకు అమలాపురానికి చెందిన డాక్టర్ సర్వేశ్వరశర్మను రాష్ట్రంలో ఏకైక సైన్స్ పరిశోధకుడిగా ఎంపిక చేసింది.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రం పరిశీలన


జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ థియరీ పరీక్షలకు సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని డీఐఈవో వనుము సోమశేఖరరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటైన పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ షాపులు తెరవకూడదని స్పష్టం చేశారు. పరీక్షలను ఫ్లెయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరుని దివ్య కల్యాణం


వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అమలాపురం రూరల్: భక్తుల గోవింద నామస్మరణ, వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య మంగళ వాయిద్యాల నడుమ బండారులంకలో పద్మావతి అలివేలు మంగ సమేత వేంటేశ్వర స్వామి దివ్య కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస బాల మిత్ర సంఘం ఆధ్వర్యంలో 38వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లోక కల్యాణార్థం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి అమ్మవార్లను కొలువు దీర్చి కల్యాణ క్రతువులో స్వామివారి తరపున అర్చక పురోహితులు, దేవేరుల తరుపున భక్తులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. వేద మంత్రోచ్ఛారణ నడుమ మంగళసూత్ర ధారణ జరిగింది. కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందం అర్చకత్వంలో కల్యాణం నిర్వహించారు. వేలాది మంది భక్తులు తిలకించారు. అనంతరం స్వామి కల్యాణ విశిష్టతను పండితులు భక్తులకు వివరించారు. భక్తులకు పులిహోర ప్రసాదం, లడ్డూ ప్రసాదంతో పాటు పానకం అందజేశారు. శ్రీనివాస మహిళా భజన మండలి కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అంకం హిమ భారతి, గుత్తుల జానకి లక్ష్మి, మాజీ ఎంపీపీ వుటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం నాగ సత్యనారాయణ, లక్కింశెట్టి ఫణి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీచెమ్ క్రికెట్ ట్రోఫీ విజేత ‘అంబేడ్కర్ ఎలెవెన్స్’


సీచెమ్ క్రికెట్ ట్రోఫీ-2025 విజేత అంబేడ్కర్ ఎలెవెన్స్‌కు ట్రోఫీ అందజేసిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: క్రికెట్ అసోషియేషన్ ఆఫ్ పుదుచ్చేరి (సీఏఆర్) గుర్తింపు కలిగిన యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (వైడీసీఏ) ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న సీచెమ్ ట్రోఫీ–2025 మ్యాచ్‌లో భాగంగా స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌లో అంబేడ్కర్ ఎలెవెన్స్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని సాధించింది. గ్రూప్‌–ఎ, గ్రూప్‌– బి నుంచి మొత్తం 10 జట్లు పాల్గొన్న ఈ ట్రోఫీలోగా భాగంగా ఫైనల్స్‌లో అంబేడ్కర్ ఎలెవెన్స్, అగ్ని లయన్స్ జట్లు తలపడ్డాయి. 25 ఓవర్ల ఫైనల్‌లో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అంబేడ్కర్ ఎలెవెన్ జట్టు 146 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అగ్ని లయన్స్ జట్టు 112 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వెంకట్ ఎంపికయ్యారు. ఆర్ఏఓ మునిస్వామి, సీఐ అదలరసన్ విజేతగా నిలిచిన అంబేడ్కర్ ఎలెవెన్ జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన అగ్ని లయన్స్ జట్టుకు, మూడోస్థానంలో నిలిచిన కేవీఆర్ జట్టుకు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ పంతగడ సుమన్, పంతగడ రమేష్‌నాయుడు, కె సుబ్బారావు, పి ప్రసాద్, ఎస్సై పునీత్‌రాజ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి


కాట్రేనికోన జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో కలసిన పూర్వ విద్యార్థులు

కాట్రేనికోన: స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కాట్రేనికోన పూర్వ విద్యార్థి కొంకి రవి అధ్యక్షతన ఈ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 26 ఏళ్ల తరువాత ఒక చోటకు చేరిన బాల్య స్నేహితులంతా ఆనందం వ్యక్తం చేశారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై చేరి ఆనాటి తీపి జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకున్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేసిన అప్పటి ప్రధానోపాధ్యాయురాలు రాయుడు సత్యనారాయణమ్మ పనిచేసారని పూర్వపు విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. తమకు చదువులు నేర్పిన గురువులు క్షదర్, శ్రీనివాసరావు, దాసు, ఆనందరావు, వెంకటేశ్వరరావు, మునలయ్య, సంజీవయ్య, లక్ష్మాజీ, కుమార్, శేషవేణి, రామకృష్ణకు వేద పండితులు ఆశీర్వాదంతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గురువులకు పాదాభివందనం చేసి నూతన వస్త్రాలను అందించి ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

అమలాపురం రూరల్: శిరస్త్రాణం (హెల్మెట్) ధరించకుండా మోటార్ బైక్‌లపై కళాశాలకు వచ్చే విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ చేసేందుకు అనుమతి తిరస్కరించాలి జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. రహదారి భద్రతపై భాగంగా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కాలేజీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామారావు, హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించి రోడ్డు భద్రతపై ముఖ్య సూచనలు చేశారు. కళాశాలలో 18 ఏళ్లు నిండిన విద్యార్థుల జాబితా తయారు చేయాలని, వీరిలో డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందని వారిని గుర్తించి లైసెన్స్‌లు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు.దీనిపై కళాశాలల యాజమాన్యాలు తల్లితండ్రులతో చర్చించాలన్నారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థికి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నదా లేదా అని సూచించే కొత్త నిబంధన ఏర్పాటు చేయాలని సూచించారు. దేశాభివృద్ధికి దోహదపడే విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురవకుండా ఉండాలన్నదే రవాణాశాఖ ధ్యేయమని అన్నారు. ఇప్పటికే కిమ్స్, శ్రీనివాస, భట్లపాలెం, ఓడలరేవు కాలేజీ విద్యార్థులపై రహదారి భద్రతా ఉల్లంఘన కేసులు నమోదు చేసి 79 మోటార్ సైకిళ్లను సీజ్ చేశామని అన్నారు. కేవలం నిర్లక్ష్యం, అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, రహదారి భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని ఇకపై కఠినంగా వ్యవహరిస్తామని డీటీఓ తెలిపారు.

కుండలేశ్వరునికి ప్రత్యేక పూజలు

కాట్రేనికోన: పెహల్‌గామ్ ఉగ్రదాడి అనంతరం ముష్కరుల ఏరివేతకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, భారత జవాన్లకు సంఘీభావం తెలుపుతూ కుండలేశ్వర స్వామికి పలువురు ప్రత్యేక పూజలు చేసారు. కాట్రేనికోన మండల పరిధిలోని హిందువులు ఆదివారం కుండలేశ్వరంలోని పార్వతీ సమేత కుండలేశ్వర స్వామికి ఆలయ అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేసారు. యుద్ధంలో జవాన్లకు స్వామివారు మనోధైర్యం, విజయాన్ని అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తాగు నీటి చెరువులో గేదెల జలకాలాటలు


రక్షిత మంచినీటి చెరువులో గేదెల జలకాలాటలు

యానాం: నియోజకవర్గ పరిధిలో వేలాది మంది ప్రజలకు తాగునీటిని అందించే 55 ఎకరాల రక్షిత మంచినీటి చెరువులో ప్రతిరోజు గేదెలు జలకాలాటలు కొనసాగుతున్నా సంబంధింత పీడబ్ల్యూడీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివారం పలువురు విమర్శించారు. స్థానిక నల్ల చెరువు ప్రాంతంలో గతంలో రక్షిత మంచినీటి చెరువు ఉండేది. కాని అది పెరుగుతున్న జనాభా అవసరాలకు సరిపోవడం లేదనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శుంకరపాలెం పరిధిలో ఉన్న భూములను రైతుల నుంచి సేకరించారు. సేకరించిన 55 ఎకరాల్లో రెండు భారీ రక్షిత మంచినీటి రిజర్వాయరు చెరువులను తవ్వారు. అప్పటి నుంచి పిల్లంక ఇంజరం బ్యాంక్ కెనాల్ నుంచి ఫ్రెంచి కెనాల్ మీదుగా నీరు ఈ రక్షిత మంచినీటి చెరువుల్లోకి వస్తుంది. ఇక్కడి నుంచి తిరిగి నల్లచెరువు ప్రాంతానికి పంపి అక్కడ నుంచి శుభ్రపరిచిన నీరు ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఇటీవలి ఈ రక్షిత మంచినీటి చెరువుల్లోకి గేదెలను వదలడంతో నీరు కలుషితమవుతోందని, ఇలాంటిని నీటిని ఎలా తాగగలుగుతామని పలువురు ఆవేదన వ్యక్తం చేసారు. తాగు నీటి చెరువుల్లోకి పశువులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

వానపల్లిపాలెం మాజీ సర్పంచ్ మృతి

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెం మాజీ సర్పంచ్ నక్కా నాగేంద్రుడు (88) ఆదివారం వయోభారంతో మృతి చెందారు. ఆయన 2001 నుంచి 2005 సర్పంచ్‌గా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఆయనకు ఒక కూతురు, నలుగురు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా చంద్రమౌళి


చంద్రమౌళి

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా పెచ్చెట్టి చంద్రమౌళి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నామినేట్ పోస్టుల జాబితాను ఆదివారం ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా అమలాపురం మండలం పేరూరు చెందిన చంద్రమౌళిని నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. చంద్రమౌళి పేరూరు సర్పంచ్‌గా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి జిల్లాలో బీసీసెల్ అధ్యక్షుడు, పాలకొల్లు పరిశీలకుడిగా పలు పదవులు నిర్వహించారు. చంద్రమౌళికి పదవి పట్ల అమలాపురంలో పలువురి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ శ్రేణుల సమావేశం

యానాం: వచ్చే ఏడాది మార్చిలో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆదివారం బీజేపీ శాసన సభ్యులు, ముఖ్య నాయకులతో ఆ పార్టీ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌ఛార్జి కేంద్ర మంత్రి మున్సుఖ్ మాండవీయ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జి హోదాలో తొలిసారిగా పుదుచ్చేరికి వచ్చిన ఆయనకు ఆ పార్టీ అధ్యక్షుడు సెల్వగణపతి, సీనియనర్ నేత పోన్ రాధాకృష్ణన్, సంస్థాగత ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురేనా, హోంమంత్రి నమశ్శివాయం తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని మరింత పటిష్టం చేయడం తదితర అంశాలపై చర్చించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నైనా విజయం సాధించాలనే లక్ష్యంతో బీజేపీ నాయకులు కృషి చేస్తున్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో నరసింహ జయంతి

అమలాపురం రూరల్: జనుపల్లిలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో నరసింహ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక నరసింహ జపయజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ మందిరం మేనేజర్ శివానంద నిమయి దాస్ భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులకు 27 పూసల కదంబనక్షత్ర మాలను ఉచితంగా అందజేశారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం

- 40 రోజుల పాటు శ్రీమద్రామాయణ ప్రవచనాలు
- నిర్విఘ్నంగా సాగిన శ్రీరామకోటి యజ్ఞం


కొత్తపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో సంపూర్ణ శ్రీమద్రామాయణ ప్రవచనాల కార్యక్రమం ముగింపు సందర్భంగా సీతారాముల కల్యాణం శనివారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. ఉమా కొప్పులింగేశ్వర ప్రవచన కమిటీ కన్వీనర్ సలాది రామ్మోహనరావు (చిన్ని) ఆధ్వర్యంలో పురాణ కళావాచస్పతి, బ్రహ్మశ్రీ దెందులూరి సీతారామశర్మ గత నెల ఒకటి నుంచి ఈ నెల 10 వరకూ ‘సంపూర్ణ శ్రీమద్రామాయణం’ ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకూ జరిగిన ప్రవచనాల కార్యక్రమానికి కొత్తపేట పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. 40 రోజుల పాటు వివిధ కాండాలను సీతారామశర్మ తన ప్రవచనాల ద్వారా భక్తులకు కళ్లకు కట్టినట్టు వినిపించారు. ఈ ప్రవచనాలతో సమాంతరంగా శ్రీరామకోటి యజ్ఞం నిర్విఘ్నంగా సాగింది. హరిహర దేవాలయాల ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ప్రవచనకర్త సీతారామశర్మ పర్యవేక్షణలో సలాది చిన్ని–నాగకవిత దంపతులతో సీతారాముల వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రవచన కర్త సీతారామశర్మ దంపతులను పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలతో కమిటీ వారు ఘనంగా సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమాలకు సహకరించిన అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్, న్యాయవాది గాలిదేవర పుల్లయ్యనాయుడు, వేమవరపు మురళి, కాకరపర్తి బంగారుబాబు, బండి శ్రీను, ముద్రగడ ఫణి, హరి, సుబ్బారావు, శివ, నల్లా గోపి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి

పి.గన్నవరం: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలోని శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, గిడ్డి శ్యామలారాణి ఫౌండేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో టాటా ఎలక్ట్రానిక్స్, హోసూర్ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 150 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 30 మందిని శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఏడాది పాటు శిక్షణలో రూ.12,500 నుంచి రూ.15 వేల వరకూ స్టైపెండ్, అనంతరం ఉద్యోగం కూడా ఇస్తారని మంత్రి వివరించారు. మంత్రి సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తుందని అన్నారు. యువత మత్తు పదార్థాలు, కల్తీ మద్యం, గంజాయికి దూరంగా ఉండాలని సుభాష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, నాయకులు సంసాని పెద్దిరాజు, చొల్లంగి సత్తిబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోగన్నమఠంలో శాంతి హోమం

మామిడికుదురు: గోగన్నమఠంలోని ధనమ్మ, సోమాలమ్మ అమ్మ వార్ల ఆలయ ప్రాంగణంలో ఆదివారం శాంతి హోమం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవార్లకు పలు ప్రత్యేక పూజలు జరిపించారు. ఇటీవల గ్రామంలో జరిగిన అరిష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈ పూజ నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ఎటువంటి అవరోధాలు, ప్రమాదాలు జరగకుండా ప్రజల్ని కంటికి రెప్పలా కాపాడాలని అమ్మ వార్లను కోరుతూ పూజలు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, కుల పెద్దలు, నేతలు ఈ పూజల్లో పాల్గొన్నారు. అమ్మ వార్లను దర్శించుకున్నారు.